సాక్షి సంగారెడ్డి
శనివారం । 21 । డిసెంబర్ । 2024



ధ్యానం.. ఆరోగ్యానికి సోపానం

రోజులో అరగంట ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని పీఎస్ఎస్ఎం ప్రతినిధులు తెలిపారు. వివరాలు 8లో ▸



అ'పూర్వ' కలయిక

డిగ్రీ చదివి 50 ఏళ్లు పూర్తయినా ఒక రినొకరు మర్చిపోకుండా తాము చదివిన కళాశాలలో కలుసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. వివరాలు 8లో ▸



మహిళల ఆర్థిక భద్రతే లక్ష్యం

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయ డమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకా లను రూపొందిస్తోంది. వివరాలు 9లో ▸

4 కొత్త మున్సిపాలిటీలు

- కోహీర్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్
- మున్సిపాలిటీలుగా మారనున్న గ్రామపంచాయతీలు
- జిల్లాలో 12కు చేరనున్న మున్సిపాలిటీల సంఖ్య



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో కొత్తగా నాలుగు మున్సిపాలిటీలు ఏర్పాటయ్యాయి. జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని కోహీర్ గ్రామ పంచాయతీ ఇకపై మున్సిపాలిటీగా మారనుంది. అలాగే పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో మూడు గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలుగా ఆవిర్భవించనున్నాయి. గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్ గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలుగా మారనున్నాయి. సమీపంలో ఉన్న గ్రామాలను కలుపుకుని ఈ మున్సిపాలిటీలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ప్రస్తుతం ఎనిమిది మున్సిపాలిటీలు ఉన్నాయి. సంగారెడ్డి, అందోల్, నారాయణఖేడ్, సదాశివపేట, జహీరాబాద్, అమీన్‌పూర్, ఐడీఏ బొల్లారం, తెల్లాపూర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు కానున్న నాలుగింటితో ఈ మున్సిపాలిటీల సంఖ్య 12కు చేరింది.

ఇస్నాపూర్ పరిధిలో ఆ నాలుగు గ్రామాలు

కొత్తగా ఏర్పడిన ఇస్నాపూర్ మున్సిపాలిటీలో పరిధిలో ఇస్నాపూర్‌తోపాటు, పక్కనే ఉన్న చిట్కుల్, పాశమైలారం, రుద్రారం, లక్డారం గ్రామాలతో కలిపి సుమారు 45 వేల జనాభాతో కలిపి మున్సిపాలిటీగా ప్రతిపాదనలు పంపారు. ఈ గ్రామాలు కూడా ఎప్పుడో పట్టణీకరణ జరిగింది. గ్రామీణ వాతావరణం అక్కడక్కడ మాత్రమే కనిపిస్తుంది. పాశమైలారం పరిశ్రమలతో విస్తరించింది. అయితే ఈ ప్రతిపాదనల మేరకు మున్సిపాలిటీ స్వరూపం ఉంటుందా..మార్పులు, చేర్పులు ఉంటాయా? అనేది ఒకటీ రెండు రోజుల్లో తేలనుంది.

కోహీర్.. మున్సిపాలిటీ, పంచాయతీ, మున్సిపాలిటీ..

మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న కోహీర్ ఇప్పుడు మున్సిపాలిటీగా మారింది. జహీరాబాద్ నియోజకవర్గంలో జహీరాబాద్ పట్టణం తర్వాత అతిపెద్ద గ్రామం ఇదే. సుమారు 15 వేల జనాభా ఉండే ఈ గ్రామాన్ని మున్సిపాలిటీగా మారింది. సమీపంలో ఉన్న ఖనాపూర్, కొత్తూరు గ్రామాలను ఈ మున్సిపాలిటీ పరిధిలోకి తెచ్చే అవకాశాలున్నాయి. ఏయే గ్రామాలు వస్తాయనే దానిపై రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. కోహీర్ 60వ దశకంలో మున్సిపాలిటీగానే ఉండేది. తర్వాత కాలంలో మేజర్ గ్రామ పంచాయతీగా డీగ్రేడ్ అయింది. ఇప్పుడు తిరిగి మున్సిపాలిటీగా మారింది.

28 వేల జనాభాతో గుమ్మడిదల

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో గుమ్మడిదల, అన్నారం, బొంతపల్లి, వీరన్నగూడం గ్రామాలు ఉండే అవకాశాలున్నాయి. సుమారు 28 వేల జనాభాతో ఈ బల్దియాను ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనల మేరకే ఈ మున్సిపాలిటీ పరిధి ఉంటుందా.? లేక దీని పరిధిలో మార్పులు, చేర్పులు ఉంటాయా? అనేది తేలాల్సి ఉంటుంది.

పారిశ్రామిక వాడలతో గడ్డపోతారం

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన గడ్డపోతారం మున్సిపాలిటీలో గడ్డపోతారంతో పాటు ఖాజీపల్లి పారిశ్రామిక వాడలు ఉండనున్నాయి. అధికారులు పంపిన ప్రతిపాదనల ప్రకారం ఈ మున్సిపాలిటీలో శెట్లపోతారం, నల్తూరు, అలీనగర్, వావిలాల, లక్ష్మీపతిగూడెం, ఖాజీపల్లి, మాదారం గ్రామ పంచాయతీలు ఉండనున్నాయి.

శతశాతమే లక్ష్యం

- టెన్త్ ఫలితాల్లో మొదటిస్థానంలో నిలిపేందుకు ప్రణాళికలు
- అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ



చాల్కిలో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): నాణ్యమైన విద్యనంచేందుకు ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తుంది. అందుకనుగుణంగా మంచి ఫలితాలను సాధించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మార్చి 21 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండటంతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పదో తరగతిలో శత శాతం ఫలితాలు సాధించేందుకు చర్యలు చేపట్టారు. గతేడాది పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం తగ్గి రాష్ట్రంలో జిల్లా ఐదవ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జిల్లాను మొదటిస్థానంలో నిలిపేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అందులో భాగంగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థుల విషయంలో వారి తల్లిదండ్రులతో మాట్లాడి మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అధికారులు ఆదేశించడంతో ఉపాధ్యాయులు ఆదిశగా ప్రయత్నాలు చేస్తున్నారు.

గంటసేపు ప్రత్యేక తరగతులు...

నవంబర్ 2వ నుంచి రెగ్యులర్ తరగతులతో పాటు ప్రతీరోజు సాయంత్రం 4.15 నుంచి 5.15 గంటల వరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను గ్రూప్‌లుగా విభజించి ఆయా గ్రూప్‌లకు ఒక్కో ఉపాధ్యాయుడు బాధ్యత వహిస్తున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధానంలో బోధన చేయడం, రెగ్యులర్‌గా తరగతులకు హాజరయ్యేలా చూడటం, పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించడంలాంటివి చేస్తున్నారు. తరచుగా విద్యార్థులకు స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు అందులో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

ప్రత్యేక తరగతులు



పదో తరగతిలో మంచి ఫలితాల కోసం ఉపాధ్యాయుల ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ తరగతులతోపాటు గంటసేపు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మంచి మార్కులు తెచ్చుకునేందుకు ప్రణాళికతో చదవాలని సూచిస్తున్నారు.

– కార్తీక్ విద్యార్థి,జెడ్పీహెచ్ఎస్, న్యాల్‌కల్

100 శాతం ఉత్తీర్ణతకు కృషి



రోజూ సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. రోజుకు ఒక సబ్జెక్ట్ చొప్పున గత నెల నుంచి ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులందరం కృషి చేస్తున్నాం.

– కె.చంద్రశేఖర్, హెచ్ఎం–జెడ్పీహెచ్ఎస్, చాల్కి

తొలిస్థానంలో నిలుపుతాం



పదో తరగతిలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు వంద శాతం సాధించేలా కృషి చేస్తున్నాం. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు ఇటీవల నూతన ఉపాధ్యాయుల నియామకం జరిగినందున మంచి ఫలితాలు వస్తాయి. జిల్లాను మొదటి స్థానంలో నిలిచేలా చూస్తాం.

– వెంకటేశ్వర్లు
డీఈవో, సంగారెడ్డి

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

కృష్ణాపూర్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ!



ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కల్హేర్(నారాయణఖేడ్): ఈ నెల 31 నుంచి వరంగల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని కృష్ణాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోనా, వర్ష, సంయుక్త, శ్రీలత, హరిత ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ శుక్రవారం మీడియాకు తెలిపారు. సంగారెడ్డిలో జరిగిన సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలో పాల్గొని ఖోఖో క్రీడలో రెండవ స్థానంలో నిలిచినట్లు చెప్పారు.

ప్రజా ఉద్యమాలకు అండగా నిలవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు



రూ.5 లక్షల విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

పటాన్‌చెరు టౌన్: ప్రజా సమస్యలకు కార్మిక వర్గం అండగా నిలవాలని, కార్మిక వర్గ సమస్యలపై సీపీఎం ముందుభాగాన నిలిచి పోరాడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని సాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ చుక్కారాములుకు యూనియన్ ఆధ్వర్యంలో రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా చుక్కా రాములు మాట్లాడుతూ...జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో సీపీఎం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభల జయప్రదం కోసం కార్మిక , కర్షక వర్గం విరాళాలిచ్చి తోడ్పాటునివ్వడం అభినందనీయమని తెలిపారు. రాబోయే కాలంలో మరిన్ని సమరశీల పోరాటాలు సాగించే దిశగా మహాసభల్లో నిర్ణయాలు తీసుకుటామన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడవయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె. రాజయ్య, యూనియన్ నాయకులు పాండు రంగారెడ్డి, మనోహర్, వీరారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్ని బాధ్యతగా నిర్వర్తించాలి

జెడ్పీ సీఈవో జానకిరెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో జానకిరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలును మరింత బాధ్యతగా నిర్వర్తించాలని జెడ్పీ సీఈవో జానకిరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కల్హేర్ మండల పరిషత్తు కార్యాలయం తనిఖీ చేసి రికార్డులు, సిబ్బంది హాజరు శాతం పరిశీలించారు. ప్రజాపాలన దరఖాస్తులు, తదితర అంశాలపై తెలుసుకున్నారు. పంచాయతీ సెక్రటరీలు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా చేయాలని సూచించారు.

ఒప్పంద ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలి

జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట ఆందోళన



వినతి పత్రం ఇస్తున్న ఒప్పంద ఏఎన్ఎంలు

సంగారెడ్డి: జిల్లాలో ఒప్పంద ఏఎన్ఎంలను ఎలాంటి రాతపరీక్ష లేకుండా వెంటనే క్రమబద్ధీకరించాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి డిమాండ్ చేశారు. గత రెండు రోజుల నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయం వద్ద 48 గంటల ఆందోళన నిర్వహించి అనంతరం ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శశాంక్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మెడికల్ యూనియన్ నాయకురాలు సంపూర్ణ, దీపిక, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలు అమానుషం

- టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంత కిషన్
- సంగారెడ్డిలో అంబేడ్కర్ విగ్రహానికి అభిషేకం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంగారెడ్డి/పటాన్‌చెరుటౌన్: పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అమానుషమని టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్ పేర్కొన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నేతలు శుక్రవారం అభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంత కిషన్, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కూన సంతోష్‌లు మాట్లాడుతూ...అంబేడ్కర్‌కు జరిగిన అవమానాన్ని అభిషేకంతో కడిగేశామన్నారు. అమిత్ షాను వెంటనే పదవిలో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు నాగరాజు,అమీర్ బేగ్, ప్రదీప్, నాయకులు రవినాథ్, నవాజ్, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

షా వ్యాఖ్యలు దుర్మార్గం....

అంబేడ్కర్‌పై చేసిన కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...రాజ్యాంగాన్ని మార్చే పనిలో కేంద్ర ప్రభుత్వం ఉందని అందులోభాగంగానే అంబేడ్కర్‌పై హోం మంత్రి వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ టీపీసీసీ కార్యదర్శి మతిన్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అతిక్, కాంగ్రెస్ నాయకులు సాయిలు ముదిరాజ్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కుట్రతోనే కేటీఆర్‌పై కేసులు

బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

సంగారెడ్డి: మాజీ మంత్రి కేటీ రామారావుపై రేవంత్‌రెడ్డి సర్కార్ కుట్రపూరితంగానే అక్రమ కేసులు పెట్టిందని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఫార్ములా ఈ రేసులో ఎలాంటి అవినీతి జరగలేదని తీసుకున్న వారే చెబితే ఇంకా అవినీతి ఎక్కడ జరిగిందో ప్రభుత్వానికే తెలియాలన్నారు. ఫార్ములా ఈ రేసుపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేస్తే ఎందుకు పెట్టడంలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టాలని రేవంత్ సర్కార్ ప్రయత్నిస్తుందన్నారు. ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకతతోనే ప్రజల దృష్టి మళ్లించాలని కాంగ్రెస్ సర్కార్ కేటీఆర్‌పై కేసులు పెట్టిందని మండిపడ్డారు. సమావేశంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, జైపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్, కార్యదర్శి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- రంజోల్‌లో ఇళ్ల సర్వే పరిశీలన



కంకోల్‌లో గ్రంథాలయంలో విద్యార్థితో పుస్తకాన్ని చదివిస్తున్న కలెక్టర్ క్రాంతి

జహీరాబాద్ టౌన్/మునిపల్లి(అందోల్): అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో రంజోల్‌లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శుక్రవారం ఆమె పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. సర్వే కార్యక్రమం చురుగ్గా కొనసాగుతుందని చెప్పారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

నాణ్యత తగ్గితే కఠిన చర్యలు

విద్యార్థులకు పెట్టే భోజనంలో నాణ్యత తగ్గితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ క్రాంతి హెచ్చరించారు. మండలంలోని రంజోల్‌లోని బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో సమావేశమై వారి నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పరిసరాలు, స్టోర్ రూం, వంట సామగ్రిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రామ్‌రెడ్డి, ప్రత్యేకాధికారి భిక్షపతి, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్ ఉన్నారు.

అంకిత భావంతో చదవాలి

పిల్లలు బాగా చదువుకునే విధంగా తల్లిదండ్రులు పోత్సహించాలని, ప్రతీ విద్యార్థి అంకితభావంతో చదవాలని కలెక్టర్ క్రాంతి సూచించారు. మునిపల్లి మండలంలోని కంకోల్ ప్రాథమిక, జడ్పీహెచ్ఎస్, ఉర్దూమీడియం పాఠశాలలను పరిశీలించారు. ప్రైమరీ పాఠశాలలో రూం టు రీడ్ సంస్థ ఏర్పాటు చేసిన గ్రంథాలయంను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గ్రంథాలయంలోని పుస్తకాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతాయన్నారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేకాధికారి రామాచారి, తహసీల్దార్ ఆశాజ్యోతి, ఎంపీడీవో హరినందన్ రావు తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక సభలు జయప్రదం చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి 30 వరకు నల్లగొండలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆరవ విద్య వైజ్ఞానిక మహాసభలు జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని న్యూగవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో విద్యా వైజ్ఞానిక మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని, సీపీఎస్ విధానం రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పింఛను పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

తాగి వేధిస్తున్నాడని..

తండ్రి చేతిలో కొడుకు హత్య



వెంకట్‌రెడ్డి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: కుమారుడు తాగి వేధిస్తున్నాడని తండ్రి కోపంతో దాడి చేయడగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు మండలం బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన అతెల్లి వెంకట్ రెడ్డి(34) కొంతకాలంగా మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను కొడుతున్నాడు. దీంతో భార్య వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. రోజు మాదిరి శుక్రవారం సాయంత్రం మద్యం సేవించి తండ్రిని కొట్టాడు. దీంతో కోపోద్రేకుడైన తండ్రి అనంత రెడ్డి కట్టెతో కుమారుడి తలపై కొట్టాడు. తీవ్రగాయాలైన వెంకట్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీడీఎల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

మంజీరాలో దూకి ఆత్మహత్య

పుల్‌కల్(అందోల్): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి సింగూర్ డ్యామ్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సదాశివపేటకు చెందిన ప్రశాంత్ (35) వ్యక్తి కుటుంబ కలహాలతో సాయంత్రం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరి సింగూర్ డ్యామ్ దిగువభాగం బ్రిడ్జి వద్ద బైక్‌ను, సెల్‌ఫోన్, చెప్పులను వదిలి బ్రిడ్జి నుంచి డ్యామ్ దిగువ భాగం మంజీరాలో దూకాడు. శుక్రవారం సాయంత్రం మృతదేహం తేలడంతో మత్స్యకారులు గుర్తించారు. బైక్, సెల్‌ఫోన్ సహాయంతో మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

లైంగిక దాడిలో పోక్సో కేసు

పటాన్‌చెరు టౌన్: ఏడేళ్ల బాలికపై లైగింక దాడికి యత్నించిన వ్యక్తిపై పటాన్‌చెరు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన కుటుంబం బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలంలోని ఓ గ్రామానికి వచ్చి నివాసం ఉంటున్నారు. ఈ కుటుంబంలోని బాలిక(7)ను ఇదే గ్రామంలో ఓ నిర్మాణ సంస్థలో ప్లంబర్‌గా పని చేస్తున్న ఒడిషాకు చెందిన కార్మికుడు చాక్లెట్ ఇస్తానని తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి పటాన్ చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేశారు.

తెరపైకి జహీరాబాద్–బీదర్ రోడ్

- అప్‌గ్రేడ్ కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కృషి
- ఇటీవల కేంద్రమంత్రిని కలిసిన ఎంపీ సురేశ్ షెట్కార్
- జాతీయ రహదారిగా గుర్తించి విస్తరించాలని వినతి



ప్రమాదకరంగా జహీరాబాద్–బీదర్ రహదారి

జహీరాబాద్‌టౌన్: జహీరాబాద్–బీదర్ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించి అప్‌గ్రేడ్ చేయాలన్న విషయం మరోసారి తెరపైకి వచ్చింది. పర్యాటక ప్రాంతాలు, సమీప రాష్ట్రాలను కలిపే ముఖ్యమైన రహదారులను గుర్తించి వాటిని జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం కోరింది. గతేడాది ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర రహదారులు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని ఆరు రోడ్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరగా అందులో జహీరాబాద్–బీదర్ రహదారి కూడా ఉంది. ఇటీవల జహీరాబాద్ ఎంపీ. సురేశ్ షెట్కార్ కూడా కేంద్రమంత్రిని కలసి జహీరాబాద్–బీదర్ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. దెబ్బతిని ప్రమాదకరంగా తయారైన జహీరాబాద్–బీదర్ రోడ్డు అప్‌గ్రేడ్ దారిలో పడటంతో రహదారి విస్తీర్ణం అంశం మరోసారి తెరపైకి వచ్చింది.

అధ్వానంగా తయారైన రహదారి

కర్ణాటకలోని బీదర్, బాల్కి, ఉద్గీర్, మహారాష్ట్రలోని పలు ప్రాంతాల ప్రజలు హైదరాబాద్‌కు జహీరాబాద్–బీదర్ రోడ్డు ద్వారా రాకపోకలను సాగిస్తుంటారు. సుమారు 32 కిలోమీటర్లు ఉన్న జహీరాబాద్–బీదర్ రహదారి అధ్వానంగా తయారైంది. గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నారింజ ప్రాజెక్టు సమీపంలో రోడ్డు ఇరుకుగా ఉండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల వల్ల ఈ ఏడాది పది మంది వరకు చనిపోయారు.

నేషనల్ హైవే అథార్టీకి బదలాయింపు

జహీరాబాద్–బీదర్ రోడ్డు ఇరుకుగా ఉండి వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. రోడ్డు మధ్యలో వంతెనలు, రైల్వే గేటు కూడా ఉండటం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతున్న రోడ్డులో రద్దీని దృష్టిలో జాతీయ రహదారిగా గుర్తించి ఫోర్‌లేన్‌గా విస్తరించేందుకు పదేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపగా కేంద్రం అంగీకరించింది. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని ఈ రోడ్డును జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (నేషనల్ హైవే అథార్టీ)కు బదలాయించారు. ఏళ్లు గడుస్తున్నా రోడ్డుకు జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయకపోవడంతో విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతోంది.

ఇటీవలే కేంద్రమంత్రికి వినతి

వికారాబాద్, తాండూర్, జహీరాబాద్, బీదర్ మధ్య అనుసంధానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. 154 కి.మీ రోడ్డుకు కేంద్రం అప్‌గ్రేడ్ చేసి అభివృద్ధి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతి పత్రం ఇచ్చారు. ఇటీవల మంత్రి జహీరాబాద్‌కు వచ్చిన సందర్భంగా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ఎంపీ.సురేశ్ షెట్కార్, బీదర్ ఎంపీలు గడ్కరీని కలసి జహీరాబాద్–బీదర్ రోడ్డును విస్తరించి అభివృద్ధి చేయాలని కోరారు.

క్లుప్తంగా

కొడిపల్లి మహిళా రైతుకు ‘అభ్యుదయ రైతు అవార్డు’


అవార్డు అందజేసిన మంత్రి తుమ్మల

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు లక్ష్మీ అభ్యుదయ రైతు అవార్డు అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఐదుగురు బెస్ట్ ప్రొగెసీవ్ ఫార్మర్ (అభ్యుదయ రైతు)లను ఎంపిక చేసి అవార్డులు ఇచ్చినట్లు సంగారెడ్డి జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ తెలిపారు. లక్ష్మీ కొన్నేళ్లుగా సంగారెడ్డి జిల్లా ఏరువాక కేంద్రంలోని మిని కిట్స్ సాగుతోపాటు తక్కువ స్థలంలో వివిధ రకాల పంటలు కూరగాయలు సాగు చేసి ఆదర్శంగా నిలువడంతో అవార్డు వచ్చినట్లు పేర్కొన్నారు. అవార్డుతోపాటు ప్రశంసాపత్రం, మెమోంటోను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారుల చేతుల మీదుగా అందుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ సహాయ సంచాలకులు ఉమారెడ్డి, రైతు రామక్రిష్ణాగౌడ్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


విక్రమ్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. శుక్రవారం స్థానిక ఎస్ మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సికింద్లాపూర్ పిట్టలవాడకు చెందిన పిట్టల విక్రమ్(30) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 18న రోజు మాదిరిగా రాత్రి భోజనం చేసి ఇంట్లో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నిద్రించాడు. ఉదయం భార్య సునీత లేచి చూడగా భర్త కనిపించలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికారు. గోమారం సమీపంలోని చెరువు వద్ద అతడి చెప్పు లు, ప్యాంట్, షర్టు, ఫోన్ కనిపించాయి. చెరువులో వెతికినా ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నాలుగు కేజీల గంజాయి స్వాధీనం

కొత్తగూడెంఅర్బన్: ఏపీ నుంచి కొత్తగూడెం మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్న నాలుగు కేజీల గంజాయిని కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. త్రీటౌన్ ఎస్సై విజయలక్ష్మి, సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్ ఏరియాలో తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా నాలుగు కేజీల గంజాయి లభ్యమైంది. నిందితులు గజ్వేల్‌కు చెందిన శ్రీనివాస్, బాలు, డొంకరాయికి చెందిన లక్ష్మణ్‌గా గుర్తించగా, ఏపీలోని డొంకరాయి నుంచి కొత్తగూడెం మీదుగా హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నట్లు అంగీకరించారని సీఐ శివ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ధ్యానం.. సంపూర్ణ ఆరోగ్యం

నేడు ప్రపంచ ధ్యాన దినోత్సవం
- శిక్షణ కేంద్రంగా విరాజిల్లుతున్న కోమటిబండ
- పిరమిడ్ స్పిరచ్యువల్ సొసైటీ ఆఫ్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- అందరికీ ఉచితంగా ధ్యానం నేర్పించడమే లక్ష్యం


కోమటిబండలోని శ్రీపాండవకృష్ణ ధ్యానక్షేత్రం

గజ్వేల్‌రూరల్: అలసిన మనసుకన్నా ప్రశాంతంగా ఉన్న మనసు చురుగ్గా పని చేస్తుంది. ప్రతీరోజూ కొన్ని నిమిషాలైనా ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నిస్తే, అది మనం కోరుకున్న విధంగా మనల్ని మనం మలుచుకోవడానికి ఉపయోగపడుతుంది. అందుకే రోజులో అరగంట పాటైనా ధ్యానం చేయటం శ్రేయస్కరమంటారు.

శ్వాస మీద ధ్యాసే ధ్యానం.. ధ్యానం చేయడం ద్వారానే ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉంటారని, ప్రజలందరికీ ఉచితంగా ధ్యానం నేర్పించడమే తమ లక్ష్యమని పీఎస్ఎస్ఎం (పిరమిడ్ స్పిరచ్యువల్ సొసైటీ ఆఫ్ మూవ్‌మెంట్) గజ్వేల్ శాఖ అధ్యక్షుడు పాశికంటి నర్సింలు పేర్కొన్నారు. శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా పిరమిడ్ స్పిరచ్యువల్ సొసైటీ ఆఫ్ మూవ్‌మెంట్ ద్వారా అందిస్తున్న సేవలపై కథనం...

పచ్చని ప్రకృతి నడుమ

బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ పర్యవేక్షణలో 8 ఆగస్టు 2002లో పిరమిడ్ స్పిరచ్యువల్ సొసైటీ ఆఫ్ మూవ్‌మెంట్ ద్వారా గజ్వేల్ కేంద్రంగా ధ్యాన ప్రచారం ప్రారంభించారు. గజ్వేల్ మండలం కోమటిబండ సమీపంలో ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కర్మలవారి కుటుంబ సభ్యులు శ్రీపాండవ కృష్ణ ధ్యాన క్షేత్రం నిర్మాణానికి స్థలాన్ని అందించగా ఆహ్లాదకరమైన వాతావరణంలో పచ్చని ప్రకృతి నడుమ 2004 డిసెంబర్ 24న బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ చేతుల మీదుగా భూమిపూజ చేసి.. ధ్యాన మార్గదర్శి అయిన గౌతమబుద్ధుని ప్రతిమను 21 డిసెంబర్ 2012న ఏర్పాటు చేశారు. తదనంతరం పిరమిడ్ నిర్మాణాలను పూర్తి చేసి 18 ఫిబ్రవరి 2018న శ్రీ పాండవకృష్ణ ధ్యాన క్షేత్రంను ప్రారంభించారు.

గజ్వేల్ నుంచి ప్రారంభమై ఇతర రాష్ట్రాల్లో

పిరమిడ్ స్పిరచ్యువల్ సొసైటీ ఆఫ్ మూవ్‌మెంట్ ద్వారా మొట్ట మొదటగా పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో ధ్యాన కేంద్రంను ఏర్పాటు చేసి గజ్వేల్ పరిసర ప్రాంతాలతోపాటు ఉమ్మడి మెదక్ జిల్లాలోని నారాయణఖేడ్, కంగ్టి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డితో పాటు తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో పీఎస్ఎస్ఎం ద్వారా ధ్యాన ప్రచారం చేశారు. అదే విధంగా బ్రహ్మర్షి పత్రీజీ పుట్టిన గ్రామమైన నిజామాబాద్ జిల్లాలోని బోధన్‌లో సైతం విస్తృతంగా ధ్యాన ప్రచారం నిర్వహించారు. గృహిణులు, రైతులు, వ్యాపారస్తులతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో ధ్యానం నేర్పిస్తూ, కోమటిబండ సమీపంలోని పీఎస్ఎస్ఎం ధ్యాన క్షేత్రంలో ప్రతీ నెల 2వ ఆదివారం, 4వ ఆదివారం ఆధ్యాత్మిక జ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతీ రోజు ఐదు నుంచి 10 మంది వరకు వస్తుంటారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న ఈ ధ్యాన క్షేత్రంలో ఎవరైనా వచ్చి ఉచితంగా ధ్యానం నేర్చుకునేందుకు అవకాశముందని నిర్వాహకులు పేర్కొన్నారు.


పీఎస్ఎస్ఎం ఆధ్వర్యంలో ధ్యానం చేస్తున్న ప్రజలు

ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి



ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రజలు క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. దీంతో అనారోగ్యానికి గురవుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతులుగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు దైనందిన జీవితంలో కొంత సమయం ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారు. పట్టణంలోని సంతోషిమాత దేవాలయం సమీపంలో అందరికీ అందుబాటులో ఉండేలా గజ్వేల్‌లో సర్వాత్మా పిరమిడ్ ధ్యాన మందిరంను ప్రారంభించి ప్రతి రోజూ సాయంత్రం 5 గంటల నుంచి ఉచితంగా ధ్యానంను నేర్పించడం జరుగుతుంది. ప్రతి ఒక్కరూ ధ్యానం చేస్తూ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే పీఎస్ఎస్ఎం ధ్యేయం.

– పాశికంటి నర్సింలు, పీఎస్ఎస్ఎం గజ్వేల్ శాఖ అధ్యక్షుడు



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

అర్ధ శతాబ్దపు ‘అపూర్వ’ కలయిక

- 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు
- గురువులకు సన్మానం
- వేదికైన సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల

సిద్దిపేటఎడ్యుకేషన్: వారంతా 70 సంవత్సరాలు పైబడిన వారు.. డాక్టర్లుగా, లెక్చరర్లుగా, వ్యాపారవేత్తలుగా, రాజకీయ నాయకులుగా, వ్యవసాయదారులుగా వారి వారి రంగాల్లో ఉన్నతంగా రాణించి రిటైర్ అయ్యారు. డిగ్రీ చదివి 50 ఏళ్లు పూర్తయినా ఒకరినొకరు మర్చిపోకుండా గెట్ టు గెదర్ పేరుతో తాము చదివిన కళాశాలలో కలుసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. మనమలు, మనమరాళ్లతో ఆడిపాడే వయస్సులో డిగ్రీ మిత్రులను కలుసుకొని చక్కని అనుభూతి పొందారు. ఇందుకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల వేదికై ంది. కళాశాలలో 1974 సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన వారంతా శుక్రవారం కళాశాలలో కలుసుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. సుమారు 100 మంది వరకు హాజరై తమకు పాఠాలు చెప్పిన అధ్యాపకులను కార్యక్రమానికి ఆహ్వానించి సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, అధ్యాపకులు పాల్గొని మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమం జరగడం అరుదని, ప్రస్తుత విద్యార్థులకు ఇది స్ఫూర్తిదాయకమన్నారు.

గురువుల బోధనలే..



50 ఏళ్ల తర్వాత తమ మిత్రులను, మాకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను కలుసుకోవడం అదృష్టంగా, ఆనందంగా భావిస్తున్నాను. గురువులు చెప్పిన బోధనకు ఆకర్శితులమై ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగంతో జీవితంలో స్థిరపడ్డాను.

–అమ్మన చంద్రారెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ

కమిటీ ఏర్పాటు చేశాం



ఇలాంటి ఓ కార్యక్రమాన్ని చేయాలనే ఆలోచన రావడం గొప్ప విషయం మా మిత్రుడు రమేశ్ వచ్చి గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని చేద్దామనగానే చాలా సంతోషం వేసింది. కార్యక్రమం సక్సెస్ కావాలంటే ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని సూచించి ఒక కమిటీ ఏర్పాటు చేసుకున్నాం. నాటి మిత్రులను కలవడం గొప్ప అనుభూతి. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నాం.

–కొండ సత్యనారాయణ, రిటైర్డ్ పీజీ హెచ్‌ఎం

అందరూ కలుస్తారనే..



డిగ్రీ చదువుకున్న రోజులు గుర్తుకొచ్చాయి. అప్పటి మిత్రులందరూ కలుస్తారనే ఆనందంతో దగ్గరి బంధువుల ఫంక్షన్ పోవాల్సి ఉన్నా పోకుండా ఈ గెట్ టు గెదర్‌కు హాజరయ్యాను. నాడు డిగ్రీ కళాశాల ఏర్పాటులో అప్పటి ఎమ్మెల్యే అయిన మా నాన్న గారు వంగ అశిరెడ్డి కీలక పాత్ర పోషించాడు. ఆ జ్ఞాపకాలు మధురం. ప్రతీ సంవత్సరం ఇలా కలుసుకోవాలనుకున్నాం.

–రాజకుమారి, సిద్దిపేట

50 ఏళ్ల తర్వాత..



గెట్ టు గెదర్‌కు 50 ఏళ్ల తర్వాత సుమారు 100 మంది మిత్రులు రావడం గొప్ప విషయం. అన్నింటికంటే మాకు చదువు చెప్పిన 8 మంది లెక్చరర్లు రావడం చాలా ఆనందంగా ఉంది. మొత్తంగా ఇలాంటి కార్యక్రమం చేయడం చాలా బాగా అనిపించింది. నాటి మిత్రులను కలుసుకో వడం మనసును తేలిక చేసింది.

–సొప్పదండి హరిశ్చంద్ర, అడ్వకేట్, మున్సిపల్ మాజీ చైర్మన్

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

రోడ్డు ప్రమాదంలో యువకుడు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన గురువారం మండల పరిధిలోని మద్దికుంట చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. పేట సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా మాడ్గుల్ చిట్టెంపల్లి గ్రామానికి చెందిన తంద్రా చేతన్ (21) తల్లితో కలిసి సదాశివపేట పట్టణంలో నివాసం ఉంటూ కంభాలపల్లి గ్రామ శివారులోని ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. గురువారం మిత్రులు భాను తేజ్, సందీప్‌తో కలిసి బైక్‌పై మద్దికుంట శివారులోని ఓ ఫామ్ హౌస్ వెళ్తున్నారు. మద్దికుంట చౌరస్తా బైక్ అదుపుతప్పి కింద పడటంతో జహీరాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తంద్రా చేతన్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భాను తేజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డీసీఎం ఢీకొని వ్యక్తి..

మనోహరాబాద్(తూప్రాన్): టీవీఎస్‌ను డీసీఎం ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు..మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండలం సుతారిగూడెం గ్రామానికి చెందిన నత్తి మల్లేశ్ (75) టీవీఎస్‌పై శుక్రవారం పని నిమిత్తం తూప్రాన్ వెళ్లాడు. అనంతరం తిరుగు ప్రయాణంలో మనోహరాబాద్ మండలం దండుపల్లి శివారులోకి రాగానే జాతీయ రహదారి 44పై డీసీఎం ఢీకొట్టింది. మల్లేశ్‌కు తీవ్రగాయాలు కాగా మేడ్చల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.మృతుడి కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కేజీవీల్ కిందపడి...

వెల్దుర్తి(తూప్రాన్): ట్రాక్టర్ కేజీవీల్స్ కింద పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని ఆరెగూడెంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన మెరుగు ప్రభాకర్(37) గ్రామంలోని కుక్కల శంకర్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం యజమాని శంకర్ పొలం దున్నుతుండగా ప్రభాకర్ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కేజీవీల్స్ కింద పడ్డాడు. ట్రాక్టర్ వెనుక వైపు ఉండే గొర్రు తలకు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


ప్రభాకర్ (ఫైల్)

ఆటో నుంచి దూకి బాలుడు..

రేగోడ్(మెదక్): ఆటో నుంచి దూకి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు మృతి చెందాడు. ఎస్ఐ పోచయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్వాన్‌పల్లి తండాకు చెందిన శ్రీకాంత్ (12)కు మతిస్థిమితం లేదు. 19న మధ్యాహ్నం తండా నుంచి కొత్వాన్‌పల్లికి వచ్చాడు. అదే రోజు సాయంత్రం తండాకు గుర్తు తెలియని ఆటోలో వెనుక ఎక్కి ప్రయాణిస్తున్నాడు. కొద్ది దూరం వెళ్లాక నుంచి కిందికి దూకడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీనునాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ అదుపుతప్పి పడిపోవడంతో..

హుస్నాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన హుస్నాబాద్ మండలంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ మహేశ్ కథనం మేరకు.. అక్కన్నపేట మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన జక్కుల ఐలేష్(40) ట్రాక్టర్ మరమ్మతుల కోసం హుస్నాబాద్‌కు వచ్చి రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. తోటపల్లి సబ్‌స్టేషన్ వద్దకు రాగానే ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. 108 ద్వారా క్షతగాత్రుడిని హుస్నాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వం గొంతు నొక్కుతోంది

జిన్నారం(పటాన్‌చెరు): అక్రమ కేసులతో ప్రతిపక్ష నేతల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసి గొంతు నొక్కాలని ప్రభుత్వం యత్నిస్తోందని బీఆర్ఎస్ నేత చిమ్ముల గోవర్దన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మడిదల మండల కేంద్రంలోని సీజీఆర్ ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ... ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మక ఈవెంట్ ఫార్ములా ఈ రేస్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహించి నగరానికి ఘనతను తెచ్చిందన్నారు. ఫార్ములా ఈ రేస్ విషయంలో అసెంబ్లీలో చర్చించి నిజాన్ని నిగ్గు తేల్చాలని బీఆర్ఎస్ కోరినప్పటికీ చర్చకు అవకాశం ఇవ్వకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. పేద ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా గుమ్మడిదలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం సిగ్గుచేటన్నారు. మండలంలో ఉన్న వ్యవసాయ భూమిని రైతులు కోల్పోవడంతోపాటు పన్నుల భారం కూడా పెరుగుతుందన్నారు. మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తే ఉపాధి హామీ పనులు, నిలిచి పోతాయని రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గుమ్మడిదలను మున్సిపాలిటీగా మార్చే ఆలోచన విరమించుకోవాలని హితవు పలికారు.

భూమిని కోల్పోతాం: రైతులు

పటాన్‌చెరు నియోజకవర్గంలోని గుమ్మడిదలను బల్దియాగా ఏర్పాటు చేస్తే వ్యవసాయ భూమిని కోల్పోతామని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం రైతు సంఘం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...అనుకూలమైన వాతావరణంలో అన్ని పంటలను పండించేందుకు గుమ్మడిదల వీలుగా ఉంటుందన్నారు. ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేసి మున్సిపాలిటీ నిర్ణయాన్ని మార్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కనీస వేతనం అమలు చేయాలి



మెదక్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు , నాయకులు

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

మెదక్ కలెక్టరేట్: ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం రూ.18 వేలు నిర్ణయించి అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని టీఎన్జీఓ భవన్ నుంచి పోస్ట్ ఆఫీస్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్త బస్సు జాత మెదక్ జిల్లాకు చేరుకున్న సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అధికారంలోకి వస్తే సౌకర్యాలు కల్పిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు కనీస వేతనాలు పెంచడం లేదని మండి పడ్డారు. సమస్యలు పరిష్కరించాలని ఆరోగ్యశాఖ మంత్రికి రాష్ట్ర ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ పరిష్కారం కావట్లేదన్నారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి నీలాదేవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాధన, రాష్ట్ర సహాయ కార్యదర్శి పద్మ, రాష్ట్ర కోశాధికారి గంగమణి, మెదక్ జిల్లా కార్యదర్శి బసవరాజు, జిల్లా గౌరవ అధ్యక్షులు నర్సమ్మ, మషా యూనియన్ జిల్లా కార్యదర్శి సావిత్రి పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఇద్దరు బలవన్మరణం

చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి..


కనకయ్య (ఫైల్)

సిద్దిపేటరూరల్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని పెద్ద లింగారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పెద్దలింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొమ్మరాజుల కనకయ్య(48) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఐదేళ్ల కిందట ఇల్లు కట్టడంతోపాటు ఇద్దరు కూతుర్ల వివాహం చేశాడు. దీంతో సుమారు రూ.15 లక్షల వరకు అప్పు అయ్యింది. అప్పులు తీర్చడానికి ట్రాక్టర్‌తోపాటు ఇంటిపై లోన్ తీసుకున్నప్పటికీ తీరలేదు. దీంతో మనస్థాపానికి గురైన కనకయ్య గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయి అదే గ్రామానికి చెందిన లింగాల జైపాల్ మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు కొమరాజుల కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపారు.

పురుగు మందు తాగి ఆటో డ్రైవర్


యాదగిరి (ఫైల్)

దుబ్బాకటౌన్: అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. శుక్రవారం రాయపోల్ పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పంగ యాదగిరి (48) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. గతంలో కుటుంబంతో కలిసి బతుకుదెరువు కోసం హైదరాబాద్ వలస వెళ్లాడు. ఖైరతాబాద్ లో నివాసం ఉంటూ జీవనోపాధి కోసం ప్రైవేట్ ఫైనాన్స్‌లో అప్పు చేసి ఆటో కొనుగోలు చేశాడు. గిరాకీ సరిగా లేక అప్పులు కట్టలేని పరిస్థితి నెలకొంది. 14వ తేదీన స్వగ్రామం కొత్తపల్లికి వచ్చాడు. అప్పులు తీర్చే మార్గం జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. స్థానికులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా యాదగిరి మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఏఎస్ఐ దేవయ్య తెలిపారు.

మనస్తాపానికి గురై యువకుడు

జిన్నారం (పటాన్‌చెరు): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మెదక్ జిల్లాకు చెందిన పిచ్చకుంట్ల బుజ్జి ఇద్దరు పిల్లలతో బొంతపల్లి పారిశ్రామిక వాడకు వచ్చి జీవనం సాగిస్తోంది. కూతురికి వివాహం కాగా, కుమారుడు సురేశ్ (19)తో కలిసి ఉంటుంది. సురేశ్ ఎలాంటి పని చేయకుండా ఖాళీగా తిరుగుతుండటంతో ఏదైనా పని చేయొచ్చు కదా అని తల్లి మందలించింది. రెండు నెలల కిందట లింగంపల్లిలో ఉండే మేనమామ కుమార్ వద్దకు వెళ్లి 18న తిరిగి బొంతపల్లికి వచ్చాడు. ఈ క్రమంలో ఇలా తిరిగితే ఎలా అని మరోసారి తల్లి మందలించడంతో మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం మృతుడి తల్లి బుజ్జి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు విద్యార్థులు ఎంపిక

రెజ్లింగ్ క్రీడలో..

తొగుట(దుబ్బాక): గుడికందుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ క్రీడలకు ఎంపిక కావడం గొప్ప విషయమని ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యుడు విభీషన్ రెడ్డి అన్నారు. 19న సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో పాల్గొన్న గంగనిగల్ల రామ్ చరణ్, తోయేటి అజయ్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర క్రీడలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో 45, 50 కిలోల విభాగంతో పాల్గొని బంగారు పతకాలు అందుకున్నారు. శుక్రవారం పాఠశాలలో మాజీ ఉప సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి విద్యార్థులకు నగదు పురస్కారం అందజేసి సన్మానించారు. అలాగే, గణిత టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా నిలిచిన ఎడ్ల కుమార్, ఎడ్ల స్రవంతిని సన్మానించి నగదు పురస్కారం అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం అంజిరెడ్డి, ఉపాధ్యాయులు నాగిరెడ్డి, కనకరాములు, వేణుమాధవ్, భిక్షపతి, హనుమారెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో..

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని బందారం హైస్కూల్ విద్యార్థులు వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. సిద్దిపేటలో జరుగుతున్న 2024 సీఎం కప్ క్రీడల్లో భాగంగా అండర్ 18 బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో, బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో కొండపాక జట్టు నిలిచింది. దీంతో బందారం హైస్కూల్ రాగుల దినేశ్, కిన్నెర మహేశ్, తేజలతోపాటు బాలికలు చింతల అనూష, బట్ట అక్షయ, బట్ట రాణి, కిన్నెర భవానీ రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు ఎంపికయ్యారని హెచ్‌ఎం రామచంద్రం పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెమోంటో అందజేస్తూ అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు నర్సింహ్మారెడ్డి, బాలకనకయ్య, శ్రీనివాస్ రెడ్డి, భాగ్యలక్ష్మి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.


జ్ఞాపిక అందజేస్తున్న హెచ్‌ఎం రామచంద్రం


విద్యార్థులను సన్మానిస్తున్న విభీషన్‌రెడ్డి

చెస్ పోటీలకు కొత్తపల్లి విద్యార్థి..

పాపన్నపేట(మెదక్): సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా మెదక్‌లో శుక్రవారం నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌లో పాపన్నపేట మండలం కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి వెంకటేశ్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీడీ నరేశ్ తెలిపారు. హైద్రాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో 31న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వెంకటేశ్ పాల్గొంటాడని పేర్కొన్నారు. విద్యార్థిని హెచ్‌ఎం దత్తురెడ్డి, టీచర్లు శివకుమార్, నాగభూషణం, వేణుగోపాల్, ప్రసాద్‌రెడ్డి , తుల సీరాం అభినందించారు.

సైక్లింగ్ పోటీలకు..


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గంగాధర్

హుస్నాబాద్‌రూరల్: హైదరాబాద్‌లో 27న నిర్వహించే రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు హుస్నాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు బల్లు నిఖిల్, నేతి జశ్వంత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో లెక్చరర్లు బండారు ఎల్లయ్య, ఎస్ఎస్, రాజులు పాల్గొన్నారు.